## క్లుప్తంగా

### రైల్వే ఉద్యోగులు హిందీపై పట్టు సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న హిందీ భాషాధికారి మహేష్‌కుమార్

సామర్లకోట: రైల్వే ఉద్యోగులు హిందీపై పట్టు సాధించాలని విజయవాడ రైల్వే డివిజన్ రాజ్య భాష అధికారి ఎ.మహేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో రైల్వే ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రైల్వే ఉద్యోగులు ఉత్తర, ప్రత్యుత్తరాలన్నింటిలో హిందీ భాష తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు జోగారావు, నారాయణరావు, చీఫ్ గూడ్స్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, చీఫ్ ఫార్మసిస్టు ఆనంద్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే పాయింట్స్‌మన్‌కు వీడ్కోలు


సామర్లకోట రైల్వే పాయింట్స్‌మన్ శివను సత్కరించిన స్టేషన్ మేనేజర్ రమేష్ తదితరులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో పాయింట్స్ మన్‌గా సుదీర్ఘ సేవలందించిన ఎస్.శివకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తన కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. సామర్లకోటలో మాదిరిగానే ఏలూరులోనూ ఉత్తమ సేవలందించాలని రమేష్ విజ్ఞప్తి చేసి రిలీవ్ మెమో అందజేశారు. రైల్వే సిబ్బంది ఆధ్వర్యంలో సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు.

### విద్యార్థినికి రిలయన్స్ స్కాలర్‌షిప్


విద్యార్థిని వేణును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వీరయ్యచౌదరి

పెద్దాపురం: డిగ్రీ విద్యార్థులకు రిలయన్స్ ఫౌండేషన్ ఏటా అందించే స్కాలర్‌షిప్‌కు పెద్దాపురం మహారాణి కళాశాల విద్యార్థిని సాధనాల వేణు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.వీరయ్యచౌదరి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ డిగ్రీ మూడేళ్లకు ఫౌండేషన్ ద్వారా అందించే రూ.1.5 లక్షల స్కాలర్‌షిప్‌కు ఇంటర్‌లో 80 శాతం పైగా మార్కులు సాధించిన వేణు అర్హత సాధించిందన్నారు. బీఎస్సీ ఎంపీసీ మొదటి సంవత్సరంలో మంజూరైన రూ.50 వేల నగదు ఆమె ఖాతాలో జమ అయ్యిందని ప్రిన్సిపాల్ తెలిపారు. వేణును కరస్పాండెంట్ జాస్తి రమేష్, వీరయ్యచౌదరి, అధ్యాపక బృందం అభినందించారు.

### టిడ్కో లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలి


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని టిడ్కో లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం కమిషనర్ చాంబర్‌లో బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టిడ్కో ఇళ్లను రిజిస్టర్ చేసి బ్యాంకులో రుణాల మొత్తం తీరే వరకు తనఖా పెట్టడం జరుగుతుందన్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత అధ్యక్షత వహించగా పట్టణ పరిధిలోని ఆయా బ్యాంకుల మేనేజర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

### కళాశ్రీ పురస్కారానికి అనూష యాదవ్ ఎంపిక

ప్రత్తిపాడు రూరల్: కళాశ్రీ జాతీయ పురస్కారానికి మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన అనూష యాదవ్‌ను ఎంపిక చేసినట్లు కళాశ్రీ ఫౌండేషన్ చైర్మన్, సినీ నటుడు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 15న గుంటూరులో ఆమెకు పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వివరించారు. కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్న లక్ష్మీనారాయణను గురువారం పిఠాపురంలో అనూష యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశ్రీ ఫౌండేషన్ ఏటా దేశ వ్యాప్తంగా పలు రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించే తెలుగు వారిని గుర్తించి వారికి కళాశ్రీ జాతీయ పురస్కారాన్ని అందజేస్తుంది. తాను చేసిన సేవలను గుర్తించి కళాశ్రీ పురస్కారానికి ఎంపిక చేసిన కళాశ్రీ ఫౌండేషన్‌కు అనూష యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గ్రామాల్లో ఉత్సాహంగా జగనన్న సురక్ష


పిఠాపురంలో మహిళకు ధ్రువీకరణపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు


పులిమేరులో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న దవులూరి దొరబాబు

పిఠాపురం: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక రాజుగారి కోటలోని 14వ సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 25, 26వ వార్డుల కౌన్సిలర్లు ఉమ్మిడి వెంకటరత్న సుజిత్, ఆర్.ఉమాదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొరబాబును శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఒక్కటైనా ఇంటి పట్టా ఇచ్చారా ? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలను కూడా మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. జగనన్న కాలనీల్లో నిర్మించేవి ఇళ్లు కాదని, ఊర్లు అని తెలిపారు. పిఠాపురం పట్టణంలోని కొంతమంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని, వారికి కేటాయించిన స్థలాలను మెరక చేసి త్వరలో వారికి అందిస్తామన్నారు. సురక్ష కార్యక్రమం ద్వారా అందుతున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, సచివాలయాల కన్వీనర్ బాలిపల్లి రాంబాబు, బొజ్జా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ పథకాలు**

కొత్తపల్లి: గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల ప్రత్యేకాధికారి పుష్పమణి అన్నారు. మండలంలోని కొండెవరం సచివాలయం-2 వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 332 మంది లబ్ధిదారులకు అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయ కన్వీనర్ గాది గంగబాబు, ఎంపీటీసీ సభ్యుడు దుళ్ల సత్తిబాబు, ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్డీ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.


వేట్లపాలెంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు


కొండెవరంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

**వేట్లపాలెంలో..**

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత జగనన్న సురక్ష నిర్వహించారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత హాజరై పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. వేట్లపాలెం గ్రామంలో 1254 సర్టిఫికెట్లను అందజేసినట్టు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోషే, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

**పులిమేరులో ధ్రువపత్రాల పంపిణీ**

పెద్దాపురం: మండలంలోని పులిమేరు గ్రామంలో జగనన్న సురక్ష నిర్వహించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా హాజరై సచివాలయాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కంటే వీర్రాఘవరావు, ఆవాల లక్ష్మీనారాయణ, నాగబోయిన రాజుబాబు తదితరులు పాల్గొన్నారు

## సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు


ప్రభుత్వ పథకాన్ని వివరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : ప్రజా సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. స్థానిక నాలుగో సచివాలయం పరిధిలోని ఆరు, ఏడు వార్డుల్లో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు ఆ వార్డు కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, కాపుగంటి సౌందర్యలక్ష్మి, సచివాలయ సిబ్బందితో కలసి పట్టణంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, నాగబోయిన రాజుబాబు, సుందరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే దుష్ప్రచారం


పిఠాపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం 3వ వార్డు పరిధిలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కుమ్మరి వీధి, కృష్ణుడు గుడి వీధి ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రారంభించి ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పిఠాపురం పట్టణాన్ని తానే అభివృద్ధి చేశానంటూ మాజీ ఎమ్మెల్యే వర్మ చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా వర్మ తీరు మారలేదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మతం లోవరాజు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, కొత్తపల్లి బుజ్జీ, బొజ్జా రామయ్య, బొజ్జా అయిలు, తలిశెట్టి వెంకటేశ్వరరావు, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధే ధ్యేయం కావాలి

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పిలుపు
- శృంగార వల్లభ స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక తత్వం పెంచడంతో పాటు ఆలయ అభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గాలు పని చేయాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలం శృంగార వల్లభ స్వామి దేవస్థాన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం గురువారం జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ చారిత్రక శృంగార వల్లభ స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే కోట్ల రూపాయలతో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. తిరుమల తిరుపతి వేంకటేశుని ఆలయం తరువాత అంతటి మహిమ కలిగిన ఈ ఆలయ చరిత్ర ఎంతో ప్రశస్తమైనదని అన్నారు. వాడపల్లి వెంకన్న ఆలయం తరహాలో ఈ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని దొరబాబు అన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్‌గా కర్రి వెంకట జగదీశ్వరరావు, పాలక మండలి సభ్యులుగా కుంచే వెంకటరమణ, రాకుర్తి కుమారి, అమలదాసు లక్ష్మి, అడబాల జగ్గారావు, అడపా శివ, పుల్లేటి కుమారి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా పెద్దింటి నారాయణాచార్యులతో ఈఓ నారాయణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయ చైర్మన్, పాలక మండలి సభ్యులను దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పులిమేరు సొసైటీ అధ్యక్షులు గోపు నారాయణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, ఆవాల లక్ష్మీనారాయణల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. తొలుత దొరబాబుకు ఆలయ మర్యాదలతో పండితులు స్వాగతం పలికారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు హాజరయ్యారు.

### రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

పిఠాపురం: గొల్లప్రోలు 216వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో ఐదుగురికి గాయాలైనట్టు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. శంఖవరం నుంచి కాకినాడ వెళుతున్న ఆటోను పిఠాపురం నుంచి గొల్లప్రోలు వైపు వస్తున్న మరో ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంఖవరానికి చెందిన ఐదుగురికి గాయాలవ్వగా వారిని మొబైల్ పోలీసులు 108లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వలంటీర్ల సేవలు భేష్

వలంటీర్లకు వందనం

గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. మా వలంటీర్ కొత్తలంక వెంకటేష్ ఎప్పటికప్పుడు మా ఇంటికి వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నాడు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను మాకు వివరిస్తున్నాడు. ఏ పథకానికైనా మాకు అర్హతలు తానే దరఖాస్తు చేసి ఆ పథకం వచ్చేలా కృషి చేస్తున్నాడు. వలంటీర్ ద్వారా మా కుటుంబానికి వృద్ధాప్య పింఛను, చేయూత, నేతన్న నేస్తం పథకాలు అందుతున్నాయి. వలంటీర్ సేవలు అభినందనీయం.

– పొన్నగంటి సుబ్రమణ్యం, లబ్ధిదారు, అమీనాబాదు


నేతన్న నేస్తం పథకానికి బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ వెంకటేష్

## అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. 3వ వార్డులోని తారకరామా నగర్‌లో రూ.10 లక్షలు, గొల్లపేటలోని కృష్ణుడు గుడి వద్ద రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ లలిత, 3వ వార్డు కౌన్సిలర్ మతం లోవరాజు, పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్లు కృష్ణవేణి, సత్యనారాయణ, తలిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

**గంగాధర్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ**

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఒమ్మి గంగాధర్ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. కాగా గంగాధర్ కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

## కచ్చితమైన ఓటరు జాబితా తయారీనే లక్ష్యం

- కాకినాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్‌ఓ సుధారాణి
- నేటి నుంచి ఇంటింటా సర్వే

కిర్లంపూడి: కచ్చితమైన ఓటరు జాబితా తయారీనే లక్ష్యంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్టు కాకినాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ) వి.సుధారాణి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ కేవీ మాధవరావు అధ్యక్షతన బీఎల్‌ఓలతో ఓటరు జాబితా తయారీపై ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ సుధారాణి మాట్లాడుతూ శుక్రవారం నుంచి వచ్చే నెల 21 వరకూ బీఎల్‌ఓలు గ్రామాల్లోకి ఇంటింటా సమగ్ర సర్వే చేస్తారన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా చేర్చాలని సూచించారు. ఓటరు జాబితా తయారీలో తప్పులు దొర్లితే బీఎల్‌ఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకూ ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, డీఐలు, ఏఎస్‌ఓలు, జూనియర్ అసిస్టెంట్‌లు, పలువురు సిబ్బంది ఉన్నారు.

**పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలి**

ప్రత్తిపాడు: పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని ప్రత్తిపాడు అసెంబ్లీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం నియోజకవర్గ ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం నుంచి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా ఓటరు సర్వే చేస్తారన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయడంతో పాటు గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్స్ ఉంటే వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల పూర్తయినవారందరినీ ఓటర్ల జాబితాలో చేర్చాలని సూచించారు.

## కిరాణా షాపులపై విజిలెన్స్ దాడులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలోని పలు కిరాణా దుకాణాలపై గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి పలు కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ ముత్యాల నాయుడు, సీఐ శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, లీగల్ అండ్ మెట్రాలజీ అధికారి సరోజిని, ఎంఎస్‌ఓ ఇస్మాయిల్ తదితరులు దాడులు నిర్వహించారు. గొల్లప్రోలులోని వెంకటనాగలక్ష్మి ట్రేడర్స్‌లో తనిఖీలు చేసిన అధికారులు ఆ షాపులో కందిపప్పు, మినపగుళ్ల ప్యాకెట్లపై మెండటరీ డిక్లరేషన్ లేకపోవడాన్ని గుర్తించారు. ఈ మేరకు రెండు కేసులు నమోదు చేశారు. అనంతరం సాయి శివకృష్ణ జనరల్ స్టోర్స్ తనిఖీలు చేసిన అధికారులు ఆ షాపులో ఎలక్ట్రానిక్ కాటాకు స్టాంపింగ్ లేకపోవడాన్ని గుర్తించారు. దీనిపై లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. లక్ష్మీ గణపతి ఆయిల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు చేశారు. ఆ షాపులో నిల్వలకు సంబంధించి షాపు యజమాని బిల్లులు చూపించకపోవడంతో పాటు ధరల చార్ట్‌ను ప్రదర్శించక పోవడంతో షాపు యజమానిపై 6ఏ కింద కేసు నమోదు చేసి రూ 2,11,750 విలువ గల పప్పు ధాన్యాలను సీజ్ చేశారు. 50 కేజీల మినపప్పు బస్తాపై మెండిటరీ డిక్లరేషన్ లేకపోవడం గుర్తించిన లీగల్ మెట్రాలజీ అధికారులు మరో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లోని రిటైల్ షాపులపై దాడులు చేస్తున్నామన్నారు. షాపుల్లో నిర్దేశించిన స్టాకు పరిమితులకు మించి పప్పు ధాన్యాలను నిల్వ ఉంచినా, ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువకు అమ్మినా ఆయా షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


గొల్లప్రోలులో కిరాణా షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

### పాఠశాలలకు నోట్ పుస్తకాలు

కొత్తపల్లి: మండలంలోని మూలపేట ఎంపీపీ పాఠశాలలోని స్టాక్ పాయింట్ నుంచి నోట్ పుస్తకాలను గురువారం పాఠశాలలకు తరలించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న విద్యా కానుక కిట్లను మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేశామని తెలిపారు.

### పంచారామ క్షేత్రంలో శ్రావణమాస పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.


సామర్లకోటలోని కుమారారామ భీమేశ్వరస్వామి